# నెత్తావి (రెక్కలు)

## దాసరి చంద్రయ్య

నాటికల్ మైళ్ళలో
కొలవలేము
కాంతి సంవత్సరాలలో
కొలవలేము-
అమ్మ మనసు
అనంతం.

# నెత్తావి (రెక్కలు) రచన ៖దాసరి. చంద్రయ్య

1. నాటికల్ మైళ్లలో
కొలవలేము
కాంతి సంవత్సరాలలో
కొలవలేము-
అమ్మ మనసు
అనంతం.

2. కన్నపేగు
నాలుగు భుజాలపై
చివరి మజలీకి
ప్రయాణం-
కొడుకు కంటికి
డాలర్ దృష్టి.

3. కూర్చుని
తింటే
కొండలైనా
కరిగిపోతాయి-
ఉపాధ్యాయుడు
అక్షయ పాత్ర.

4. ఆంగ్లేయులు
విడిచిన
కుబుసంలోనే
మన నాయకులు-
రంగులోనే
తేడా.

5. అందుగలదని

ఇందులేదని

సందేహము

వలదు–

అంతటా

అవినీతే.

6. అమ్మాయి

కాస్త చామనఛాయ

ఫరవాలేదు

ఎంతిస్తారు?–

అసలు కన్న

వడ్డీ మిన్న.

7. కన్న బిడ్డలా

పెంచిన

గొర్రెను

బేరానికి పెట్టాడు–

కసాయి

ఎవరు?.

8. నెక్టైతో

టైట్‌షూతో

కాన్వెంట్లో

చిన్నారి–

పంజరంలో

నెమలి.

9. చెట్టును నరికితే

మనల్ని

మనం

చంపుకున్నట్లే-

చెట్టు

ఒక డాక్టర్.

10. కాలుష్యానికి

పెట్రోలు

పోసి

పెంచుతున్నాం -

పాలు పోసి

పెంచిన పాము?.

11. విద్య

ప్రపంచం

ఆమోదంచిన

కరెన్సీ -

సూర్యుని

వెలుగు.

12. గాఢ సల్ఫూరిక్ ఆమ్లం

సజలంగా

మారుతుంది

నీటి కలయికతో-

విరుగుడుంది

విషానికి.

13. దేవుడి
పదకొండో
అవతారమే
డాక్టర్–
ఫిక్స్‌డ్
నైవేద్యం.

14. తెలుగు
తొలగిపోతూవుంది
ఇంగ్లీషు
ఇంట్లోచేరింది–
వెనకొచ్చిన
కొమ్ములు.

15. తెలుగు కోకిలమ్మ
కూ..కూ.. అనకుడా
కే..కే..అని
పాడుతూవుంది–
పరిసరాల
ప్రభావం.

16. అమ్మ పాలు
అమూల్ పాలు
ఆరోగ్యంలో
సమ ఉజ్జీలా?–
అమ్మ
మమ్మీ అయ్యింది.

17 .చందమామ

తెలుగు ప్రాంతానికి

వచ్చేసరికి

కళ తగ్గుతున్నాడు-

చందమామ రావే పాట

అటక మీద.

18. ఉగాది పట్టు పరికిణి

జనవరికి

మిడ్డీగా

మారింది-

దర్జీ

దొంతనం.

19. ఇంటర్మీడియట్‌లో

తెలుగు కంటే

సంస్కృతమే

తేలికయ్యింది-

మార్కులు

నూటికి నూరు.

20. అవకాశాలు

అప్పుడప్పుడొస్తాయి

అదృష్టం

ఒకటీ,రెండు సార్లే-

ప్రయాణికుడి కోసం

రైలు ఎదురు చూడదు.

21. గమ్యం
చేరాలంటే
అడుగు
సాగాలి–
ప్రయత్నంతోనే
ఫలితం.

22. ఆటంకం
ఎదురైందని
ఆగిపోతే
విజయం ఎలా?–
మబ్బులు కమ్మాయని
సూర్యుడు ఆగిపోడు.

23. రాజకీయ
వృక్షానికి
వేరు పురుగులు
చేరుతున్నాయి–
సోమరిగా
నిజాయతీ.

24. అతను
ఎగిరాడు
మనసు
సహాయంతో–
ఆలోచనలే
రెక్కలు.

25. కులాభిమానం
మతాభిమానం
లేవు
తనకి–
సరిహద్దు
సైనికుడు.

26. అభం శుభం
తెలియని
చిన్నారి
చెత్త కుండీలో–
ప్రేమ
ముదిరింది.

27. నువ్వు
నేను
మేము
మనము–
గడ్డి పోచలు
కలిస్తే.

28. ఎడమ పళ్లెంలో
డబ్బు
కుడి పళ్లెంలో
గౌరవం–
ఒకదానికొకటి
అనులోమం.

29. భారతదేశంలో
ఎన్ఆర్ఐ తండ్రి
చిన్న పేగుల్లో
మంట–
ఆమెరికాలో
ఆర్ధికమాంద్యం.

30. పెంచిన చెట్టు
పండు నిచ్చింది
ఆకలి తీర్చింది
నీడనూ ఇచ్చింది–
పున్నాయ నరకం
ఎక్కడ?.

31. ఒక పార్టీకి
ఒక నియోజకవర్గంలో
ఓట్ల శాతం
పెరిగింది–
అభ్యర్ధి
బలమైనోడు.

32. ఆమె
ముఖాన్ని
ప్రేమ
తినేసింది–
ప్రేమికుడి మనసులో
యాసిడ్.

33\. సమాజంలో
ఎదురయ్యే
ప్రతిదాన్నీ
తలకెత్తుకోకూడదు–
దిబ్బలో
కోడి.

34\. నిన్ను
నిన్నుగా
చక్కగాచూపుతుంది
అద్దం–
నిజమైన
మిత్రుడు.

35\. చెట్టు
బాధ్యత
కలిగిన
కొడుకు–
కష్టే
ఫలి.

36. మొలకెత్తిన
ఆలోచనకు
నీళ్లు పోసి
పోషణ చెయ్–
చెట్టు నుంచి
ఎన్నో విత్తనాలు.

37. కప్ప
ఉభయ చరజీవి
నీటిలోనూ
నేలమీదనూ–
నేర్పరి
బహుచరజీవి.

38. దుర్యోధనుడు
దుష్టుడైనాడు
ధర్మరాజు
ఇష్టుడైనాడు–
ముత్యపు చిప్పలో
చినుకు.

39. ఒకరి మీద
ఆధారపడితే
సొంత నడక
ఉండదు–
చందమామ
వైభోగం.

40. పులి
శాకాహారిగా
మారిందట
ఎంతకాలం–
ఇంగువ కట్టిన
గుడ్డ.

41. ఒక అడుగు
ముందుకు పడితే
గమ్యం
ఒకడుగు చేరువౌతుంది–
తాబేలే
నిదర్శనం.

42. మున్నీరు
ఇంకిపోవచ్చు
కన్నీరు
ఇంకిపోదు–
జీవతం
కష్టాలమయం.

43. సంస్కృతి
సంస్కారం
ఒక దానికొకటి
విలోమాలు–
వానరంగా
మానవుడు.

44. పుట్టిన రోజు

మరణం

ఎదురెదురు

ప్రయాణించే రైళ్లు-

ఒకటి ఎక్స్‌ప్రెస్

మరొకటిప్యాసెంజర్.

44. పూల

జీవితం

ఒకరోజైనా

సార్థకమే-

కాకిజీవితం

ఎందుకు?.

45. తీపి నది

ప్రవహించి

సంద్రంలో

కలిసింది-

మర్రి చెట్టు

నీడ.

46. కలసి

ఉంటే

కలదు

సుఖం-

ఉమ్మడి కుటుంబం

ఇంద్రధనుస్సు.

47. మబ్బు
కరిగింది
పైరు
పెరిగింది-
ద్రవ్యనిత్యత్వం
నిజమే కదా?

48. శిశిరానికి
స్వాగత మిచ్చి
రాలిపోయింది
పండుటాకు-
కొత్త తరానికి
అవకాశం.

50. ఐస్‌బర్గ్
కనిపించేది కాసింత
కనిపించనిది
కొండంత-
ఎదుటి వ్యక్తి
మనసు.

51. ఒకసారి
కుడి పాదం ముందైతే
ఇంకోసారి
ఎడమ పాదం-
ఆలుమగలు
పాదాలు.

52. అందం
కరిగిపోతుందని
ఆవిడ బిడ్డకు
డబ్బా పాలు పట్టింది–
సొంత ఇంటి
కోకిలమ్మ.

53. పెన్నులా
పరిగెత్తకు
పెన్సిల్లా
నడువు–
తప్పు దిద్దుకంటేనే
విజయం.

54. పళ్లు
రాలగొట్టుకోవడానికి
ఏ రాయి
అయితేనేం?–
ఏదో ఒక పార్టీకి
ఓటు.

55. తలవాకిలి
రంగవల్లి కోసం
కళ్లల్లో వత్తులు వేసుకొని
ఎదురు చూస్తూవుంది–
కోడిపుంజుకు
బద్ధకం.

56. మమ్మీ
అడుక్కొనే
అంకుల్
అన్నానికొచ్చాడు-
మనుషులంతా
ఒకటే?.

57. ఆశను
చిన్నదిగా ఎంచుకో
వీలైతే
భాగాలు చేసుకో-
అణువులు
పరమాణవుల కలయికే.

58. కోయిల
రంగు
నలుపని
ఈసడించుకొంటామా?-
ప్రతిభకే
గౌరవం.

59. కాస్త
తడితోనే
తొందరపడి
మొలకెత్తకు-
ఎక్కువకాలం
నిలబడలేవు.

60. తల్లిదండ్రుల కంటే
ప్రాణంలేని
తలుపులే
ఇంటికి రక్షణా?–
అనురాగం
ఉండూకమైంది.

61. మొలక...
పుట్టుకనాడే
శిరస్సు
పైకెత్తుతుంది–
వీరుడు
తల వంచడు.

62. కనిపించేదంతా
నిజమా?
తెల్లనివన్నీ
పాలా?–
ఆకాశం
చెప్పింది విను.

63. అమ్మ
దేవుడ్ని
భిక్షగా
కొడుకు కావాలంది–
తథాస్తుతో
భిక్షగత్తె అయ్యింది.

64. ఆకాశాన్ని
అందుకోవాలనుకోవడం
ఎంత
అవివేకం?
ఎండమావి
దాహం తీర్చదు.

65. బస్సు
ముందుకు
రోడ్డు
వెనుకకు–
చలనంతోనే
గమ్యం.

66. గడియారం
ఆగిపోయిందని
కాలం
ఆగిపోతుందా?–
కాలం
జీవనది.

67. చనిపోయే వరకు
అమ్మ
అనాథ
కాలేదు–
కొడుక్కి
పెళ్లి కాలేదు.

68. విమానంలో అందిస్తే
ఎయిర్ హెూస్టెస్
హెూటల్‌లో అందిస్తే
సర్వర్–
పిజ్జాగా మారిన
దిబ్బరొట్టె.

69. పుణ్యం,పాపం
పూర్వ జన్మల్లోని
డిపాజిట్లు
లోన్లు–
ఈ జన్మలో
బాలెన్సు.

70. కొవ్వొత్తి
మండింది
వెలుగు
పండింది–
వొకరి నాశనం
మరొకరి ఉన్నతి.

71. నిప్పు
ఆరితే బొగ్గు
బొగ్గు
మండితే నిప్పు–
జీవితం
ఓ చక్రం.

72. చందమామ రావే
జాబిల్లి రావే
కొండెక్కి రావే
గోగుపూలు తేవె-
అన్నప్రాసన నాడే
అబద్ధ ప్రాసన.

73. నీరు పడిపోతున్నా
పల్లానికే
చీమ చిక్కిపోతున్నా
బెల్లం లోనికే-
చెడు మార్గం
అయస్కాంతం.

74. కిటికీలు
పెద్దవి
వెంటిలేటర్లు
చిన్నవి-
ఎక్కువ రావాలి
తక్కువ పోవాలి.

75. మనుషుల
పాపాల్ని
తాపాల్ని
కడుగుతుంది-
నీరు
మహా ఋషి.

76. ఆలోచనల్ని
ఏరగలిగితే
విశ్వాన్నే
నింపవచ్చు-
మనసు
ఓ అక్షయ పాత్ర.

77. ముందొచ్చిన
చెవులకంటే
వెనుకొచ్చిన
కొమ్ములు వాడి-
పుస్తకాన్ని
టి.వి మింగేసింది.

78. ఎంత వేగంతో
ఊగినా
ప్రపంచాన్ని
దాటిపోదు ఊయల-
బడుగు జుట్టు
అవినీతి చేతిలో.

79. గాయపడిన
హృదయానికి
మరపు
దివ్యౌషధం-
కాలమే
డాక్టర్.

80. అమ్మ
గుడి మెట్ల వద్ద
అడుక్కుంటూ వుంది
దీనంగా–
మంత్రసాని
కుట్ర.

81. ఒక కోరిక
పండింది
మరొకటి
పూచింది–
ఆశ
అరటి చెట్టు.

82. ఎదురు చూపు
కంటికి
మంచిది
కాదు–
చెట్టు
పచ్చగా వుంది.

83. ఉన్నోడికి జీర్ణాశయం
సైబీరియా
లేనోడికి
సహారా ఎడారి–
ఆకలి
పక్షపాతి.

84. కాకి గూట్లో
కోకిల గుడ్లు పెట్టి
సంతానాన్ని
పెంచుకొంటుంది-
పెట్టుబడితో
శ్రమ దోపిడి.

85. పగటి కలలైనా కను
మెదడు
మేల్కొనైనా
ఉంటుంది-
ఉపయోగించని
బావి.

86. మొదటిసారి
అనుకున్నట్లుగా
రెండవసారీ
జరిగింది-
మూఢ నమ్మకానికి
షుగర్ కోటింగ్.

87. పువ్వు
ఒకటే
పూజకీ..పెళ్లికీ
సీమంతానికి..చావుకీ-
పరిసరానుగుణ్యత
ప్రయోజన లక్షణం.

88. పూలబొకేను
కరివేపాకును
ఉపయోగించుకొనేది
అవసరం తీరేవరకే-
తల్లిదండ్రులు
ఉత్ప్రేరకాలా?

89. ప్రయత్నిస్తే
ఎడారిలోనైనా
ఏపుగా
ఎదగొచ్చు-
గోడ నెర్రిలో
మర్రి చెట్టు.

90. కూటికోసం చేస్తే
రికార్డ్ డాన్స్
క్యాష్ కోసం చేస్తే
స్టార్ నైటు-
పదాలకూ
పక్షపాతమే.

91. అమ్మమ్మ..నానమ్మల
పళ్లు రాలిపోయాయి
సంస్కృతి
సరఫరా ఆగిపోయింది-
జీవ నది
ఇంకిపోయింది.

92. మనసే
కాదు
ఇల్లూ
ఇరుకైపోయింది–
వివాహ భోజనం
అల్పాహారమైంది.

93. ఉమ్మడి కుటుంబం
పాయలు
పాయలుగా
చీలిపోయింది–
కన్నతల్లి
వారాల అమ్మ.

94. అరకొర జ్ఞానంతో
వాదనకు దిగితే
పదిమందిలో
అబాసుపాలు–
పద్మవ్యూహంలో
అభిమన్యుడు.

95. కోడలు
చేసిన
చిన్న తప్పులే
పెద్దగా కన్పిస్తున్నాయ్–
అత్త కళ్లు
భూతద్దాలు.

96. సజ్జనుడితో
స్నేహం
సంఘంలో
విలువనిస్తుంది-
పూలతోట నుంచి
వచ్చే గాలి.

97. బలమైన
శత్రువుతో
తలపడటం
అవివేకం-
సూర్యునితో
మంచు.

98. ఉన్నరోజు
పండగ
చేసుకొంటే
రేపో?-
చీమ
పొదుపరి.

99. రేపటి
గురించి
ఈ రోజే
ఆలోచించాలి-
ఒంటె
భవిషద్దర్శిని.

100. నీలోని లోపాలు
ఇతరుల కంటే
నీకే
బాగా కనబడతాయి–
నీ మనసే
నీకు అద్దం.

101. బియ్యం కొలత
కేజీల పద్ధతి పోయి
గింజల కొలత
వస్తుందేమో?
సెజ్ నోట్లో
పంటపొలాలు.

102. సంక్షేమ పథకాల్ని
ప్రభుత్వం
ఎన్ని ముందుకు తెచ్చినా
పేదవాడు పేదవాడే–
బ్లాక్ హోల్
రాజకీయ నాయకుడి పొట్ట.

103. బాబా పెదవులపై
వేదం
కన్నుల్లో
కామం–
అభినవ
దేవేంద్రుడు.

104. మురికి కాలువ కాడ
గడ్డంతో పిచ్చోడు
కట్ చేస్తే
ఆశ్రమంలో బాబా
కనకపు సింహాసనంపై
శునకం.

105. ఎలక్షన్లో
అభ్యర్థి
ఓటును
కొనుక్కొన్నాడు-
అవినీతికి
పెట్టుబడి.

106. చిన్నారి
పిచ్చుక
చిరంజీవి
కాలేకపోయింది-
సెల్ టవర్
బ్రహ్మాస్త్రం.

107. శిశిరంలో
చెట్టు
ఆకుల్ని
రాల్చేసింది-
అనువుగాని
చోటు.

108. పిల్లల్ని
తల్లిదండ్రులు
వళ్లోనే
ఉంచుకోకూడదు-
మఱ్రి చెట్టు కింద
మొక్క

109. ప్రతిఫలం
చెల్లించినా
ఫలం
దొరకలేదు-
మబ్బు
నీరయ్యింది.

110. దొంగను చూసి
కుక్క మొరిగింది
బిస్కెట్టును
లంచంగా ఇచ్చాడు-
వర్తమానం
బలమైనది.

111. అధికారం
అధికారి
వ్యక్తిత్వాన్ని
మింగేస్తుంది-
తన గుడ్లను
తనే తింటుంది పాము.

112. కూతిరి పెళ్లికి
పందిరి వేయాలని
తెగతిరుగుతున్నాడు
తండ్రి
కట్నపు గుంజలు
దొరకలేదు.

113. సామాన్యునికి
అర్థం కాని కవిత్వం
కవిలో ఉన్నా ఒకటే
కావ్యంలో ఉన్నా ఒకటే-
పెళ్లిలో
మంత్రాలు.

114. దేశమంటే
మట్టి కాదోయ్
దేశమంటే గొర్రెలోయ్-
ఓటు వెనుకే
ఓటు.

115. నిముషాల ముల్లు
పరిగెడుతుందని
గంటల ముల్లూ
పరిగెడుతుందా?
పులిని చూసి
వాతలు.

116. ఆచరణ లేని
ఆలోచనలు
గంపడైనా
ఏం లాభం?-
కుర్చీకి
నాలుగు కాళ్లు.

117. నేను
న్యాయవాదిని
నా అంతరాత్మ
న్యాయమూర్తి-
ఎక్కువసార్లు
నాదే గెలుపు.

118. మూర్ఖుణ్ణి
భయపెట్టి..
బుజ్జగించి
మార్చలేము-
కుక్క తోక
వంకర.

119. దేశానికి
సేవ చేయాలంటే
సైన్యంలో
చేరు-
దోచుకోవాలంటేనే
రాజకీయం.

120. వాకిట్లో
చెట్టు
వరండాలో
బోన్సాయ్ అయ్యింది–
ప్రతిబింబం
పనిచేయదు.

121. ప్రపంచం..
వృత్త పరిధి
మీదనే
తిరుగుతూ వుంది–
డబ్బే
కేంద్రం.

122. సమస్య
చిన్నదని
తాత్సారం
చేయకూడదు–
అగ్గిపుల్ల
తల ఎంత?

123. ఎండమావి
కనిపిస్తూనే వున్నా
ఎంత నడచినా
చేరుకోలేవు–
ఆశను
పట్టుకోలేం.

124. పిల్లి
కళ్లు మూసుకొని
పాలు
తాగుతూవుంది-
సమాజమే
సెర్చిలైటు.

125. సీతాఫలం
తింటే
కడుపు
నిండుతుందా?-
గాంధారికి
నూరు మంది.

126. ఆవేశంలో
తీసుకున్న
నిర్ణయానికి
ధృఢత్వం ఉండదు-
మునగ చెట్టు
చేవ.

127. ఒక అపజయం
ఎదురైందని
ఆగిపోతే
గమ్యం అందదు-
మనిషికి
రెండు కళ్లు.